యీ సుందర దృశ్యం కూడా యెక్కడ చెదిరిపోతుందో అన్పిస్తోంది. అతని ఆలోచన్లు అటు తిరిగి యిటు తిరిగి మళ్ళీ యింటిమీదకి మళ్ళినాయి.

నాలుగు సంవత్సరాల క్రితం యిల్లు వదిలేసి వచ్చేసాడు. అమ్మ యెట్లా వుందో! స్వాతంత్ర్యోద్యమంలో చేరటానికి చెప్తే వద్దంటుందని, "నా కున్నది నువ్వొక్క నలుసువి. ఆ వుద్యమంలో చేరటానికి యింకా చాలామంది వున్నారులే" అంటూ ఆటంక పరుస్తుందని, వెడతానంటే యేడ్చి అడ్డు పడుతుందని చెప్పకుండా వచ్చేశాడు. మర్నాడు లేడని తెలిసియెంత క్రుంగిపోయిందో! అన్నం నీళ్ళు మాని యెన్ని రోజులు యేడుస్తూ పడుకుందో! కాని యేం చేస్తాడు తను. దేశం అత్యవసర పరిస్థితుల్లోవుంటే పౌరుడిగా తన కర్తవ్యాన్ని యే విధంగా విస్మరిస్తాడు! విస్మరిస్తే తృప్తిగా బ్రతగ్గలడా! దేశమాత కన్నీళ్ళతో రమ్మని పిలుస్తుంటే వెళ్ళకుండా యెలా! అందుకేకన్నతల్లినిబాధ పెడుతున్నానని తెలిసి కూడా నిగ్రహించుకుని వెళ్ళాడు. సుధ వుంది కాబట్టి కొంత ఫర్వాలేదు. అసలు ఆ ధైర్యంతోనే తను వెళ్లాడు. సుధని గురించిన ఆలోచనలు మెదలగానే అతని మనసంతా తీయని బాధతో నిండిపోయింది.

తను యిల్లు వదిలి వచ్చేముందు, ఆ రాత్రి తనకి సుధకి జరిగిన సంభాషణ యిన్ని సంవత్సరాలలో ఒక్క క్షణమైనా మర్చిపోయాడా! అసలు జన్మలో మర్చిపోగలడా! ఆ రోజు పుచ్చ పువ్వులాటి వెన్నెట్లో పున్నాగ చెట్టుక్రింద వీడ్కోలు తీసుకుంటూ ఆఖరిసారిగా మాట్లాడిన దృశ్యం కళ్ళముందు కదిలింది.

"వ్యక్తిగత అభిప్రాయాలకి, స్వసుఖాలకి స్వస్తి చెప్పాల్సిన అమూల్యమైన కాలం సుధా! ఉప్పెన వచ్చి ప్రవాహంలా పొంగి పొర్లుతున్న యీ నవ చైతన్యంలో నాలాంటివాళ్లు వురికి ఆ ప్రవాహ వేగానికి మరింత బలం తీసుకురావాలి. అలా వురక కలిగిన ధైర్య సాహసాలునీలాంటివాళ్లుయివ్వాలి. ఈసారి యీ గాలిదుమారం నుంచి ఆంగ్లేయులు తప్పుకోలేరు. దేశంలో వాళ్ళ అధికారానికి స్వస్తిపలికి మూటా ముల్లె సర్దుకుని వెళ్ళిపోక తప్పదు" ఆవేశంగా అన్నాడతను.

"కాదన్నానా బావా! కాదన లేదుగా నేను ?" యేడుపు దిగమింగుతూ అంది సుధ.

ఇద్దరు ఆగిపోయి ఒకళ్ళని ఒకళ్లు ఆర్తంగా, అనురాగంగా చూసుకున్నారు.

(సశేషం)





# లక్ష్మీదాసు కథ

"లక్ష్మీదాసు శుక్రవారం నాడు సెలవు పెట్టాడు" అనే ఘోరమైన వార్త ఆ తాలూకాఫీసులో ఎక్కడివాళ్ళనక్కడే స్తంభింపజేసింది. కొందరు మూర్ఛపోబోయారు. కొందరు గుడ్లెళ్ళబెట్టారు; కొందరికి నోళ్లు పడిపోయాయి. మరికొందరు సోడాలుచ్చేసుకున్నారు. ఎక్కడి పనులక్కడే ఆగిపోక తప్పలేదు.

పరిస్థితులింతగా విషమిస్తాయంటే విషమించవూ మరి?! దాసు తన ఆరేళ్ళ సర్వీసులోనూ మొట్టమొదటిసారిగా క్యాజువల్ లీవు పెట్టాడంటే - ఎటువంటి అసాధారణపరిస్థితులొచ్చాయో ఊహించ శక్యమా?

దాసు ఆ తాలూకాఫీసులో

"హరి ఓం" అంటూ ఆ రేళ్ళనాడు లోయర్ డివిజన్ గుమాస్తాగా ఓ మాఘి పాడికుండలాటి సీట్లో కాలెట్టి; ఆ వెంటనే కూర్చునీ అక్కడే స్థిరంగా పరిపాలిస్తున్నాడు. ఆ సీట్లో అతడుతప్ప మరోడు నెగ్గలేడని తాసిల్దారుగారికి నిశ్చితాభిప్రాయం. అందుకే ఎప్పుడన్నా దాసుకు ట్రాన్స్ఫర్ ఆరర్డొస్తే తానే స్వయంగా వెళ్ళి కలెక్టరు కాళ్ళుచ్చుకునీ, డిప్టీ కలెక్టరు కాళ్లుచ్చుకునీ బతిమాలి, శిలల్ని సైతం కరిగించే శాడ్ శాంగ్స్ పాడి, తానూ ఏడ్చేసి, మొత్తంమీద ఆ ట్రాన్స్ఫర్ ఆపేసేవాడు. దాసుకూడా ఆ సీట్లోని మంచి లక్షణాలూ, తాసిల్దారుగారి నిశ్చితాభిప్రాయమూ గమనించినవాడై డిపార్టుమెంటల్ పరీక్షలు కూడా ప్యాస్ కావాలని కలలో కూడా తాపత్రయపడలేదు. తీరా పడి ప్యాసయితే ట్రాన్స్ఫరూ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ట్రెయినింగూ, పొలాలూ, గట్లూ, పుట్టలేగా గతి? ఇక్కడున్న మజా అక్కడెలా వస్తుంది? సెలవు పెట్టుకుండా వున్న కొద్దీ మజా ఎక్కువ!

ఇంతకీ ఆ సీట్లోని "మాంఛి" లక్షణా లేమిటీ?

నిత్యమూ బోలెడు కాగితా లొస్తాయి. వాటిలో "అర్జెంటూ" "వెరీ అర్జెంటూ" బహు తక్కువ. మామూలు కాగితాల తాలూకు మనుషులు మాత్రం "వెరీ అర్జెంట్"గా వచ్చేస్తా రతనిదగ్గరకు రోజూ. ఆ వచ్చినవాళ్ళను సాదరంగా కాలినోస్ చిరునవ్వుతో - ఆహ్వానించి, ముక్కాలిపీటపైనుఖాసీనులనుచేసి, ఊరూ, పేరూ, వారి కష్టసుఖాలూ విచారించి, తన డ్రాయరు సొరుగు తెరిచి ఓ వక్కపొడిపొట్లం, ఓ నస్యం డబ్బా, ఓ చార్మినార్ సిగరెట్టూ, ఓ బీడీ, మరో చుట్టా టేబిల్ మీద పడేసి "ఇందులో మీ కిష్టమైన వాటిని స్వీకరించి నన్నానందింపజేయ గోరుతున్నాను. మంగళం మహత్. శ్రీ శ్రీ శ్రీ" అంటాడు. మరీ ఎక్కడోగాని ప్రతి ఆసామీ వాటిలో ఒకటో రెండో స్వీకరించి దాసుని తన్మయుణ్ణిచేసి "అబ్బా! మీకు చాలా ఋణపడి వున్నానుసుమండీ!" అంటాడు.

"ఛ ఛ! ఇందులో ఋణమే ముందరండీ! పాపం మీ రేదో అవసరముండి వచ్చారు. వచ్చిన వారిని ఏదో నాకు చేతనైనంతలో మర్యాదచేసి మీ అవసరం తీర్చి మరి నా అవసరం మాత్రం గడుపుకోవద్దూ?" అంటాడు దాసు. "అవసరం" అనే మాటమీద ఓ క్వింటాల్ బరువేసి. ఇంత తతంగమూ నవ్వుతూ జరిపేసి, గభాల్న ఆ వ్యక్తి తాలూకు కాగితం బయటకు తీసి, "ఇక మీరు నిర్భయంగా, నిశ్చింతగా ఇంటి కెళ్ళండి. మీ పని వెంటనే జరిగి తీరుతుంది" అని అభయహస్త మిస్తూండగానే ఆ ఆసామీ తన శక్త్యానుసారం - ఏదో - అతని జేబులోనో, చేతిలోనో పెట్టేసి "ఇదిప్పటికి వుంచండి. మళ్ళీ దర్శనం చేస్తాను" అంటూ ధైర్యంగా, ఆనందంగా నిష్క్రమిస్తాడు. నిజంగానే ఆ పని వెంటనే జరుగుతుంది.

మిగతా గుమాస్తాల కడుపులు మండే దిక్కడే! మరి మండవూ? తామంతా చిరుగ్గుడ్డలూ, నూలుగుడ్డలూ ధరించి, ఆరోగ్యాలు పాడుచేసుకుని అహర్నిశలూ పని చేసినా ఆ జీతంరాళ్లు తప్ప మరో దిక్కు లేదాయె! దాసుని జూడబోతే - గ్లాస్గో పంచెలూ, టెర్లిన్ చొక్కాలూ, బూట్లూ, నున్నగా నైస్‌గా మెషిన్‌తో చేసిన తలమీద తెల్లని ఉన్నిటోపీతో, నిండిన కడుపుతో ఆనందంగా ప్రత్యక్షమవుతాడు రోజూ. కేవలం జీతంరాళ్ళే అయితే అతనిలా బ్రతగ్గలడా దర్జాగా.

ఇతర గుమాస్తాలంతా అక్కసు పట్టలేక విడివిడిగానూ, జోడు జోడుగానూ, గుంపులు గుంపులుగానూ కూడా దాసుకు ట్రాన్స్ఫర్ తెప్పించాలనీ, లేక ఆ సీటు మార్పించాలనీ, లేదా కనీసం ఒక్కరోజన్నా సెలవు పెట్టించాలనీ ఎన్నోసార్లనుకుని ప్రయత్నించి, తలక్రిందులై దేవుడికి కూడా దణ్ణాలూ దస్కాలూ పెట్టి, ఆయన సహాయం కూడా అర్థించి, ఎదురు చూస్చూసి హతాశులై "ఇక లాభంలేదు. దేవుడు దాసు పక్ష[illegible]" అనే ఏకైక నిర్ణయానికి వచ్చిన తర్వాత ఎన్నో యుగాలకి "దాసు శుక్రవారంనాడు సెలవు పెట్టాడు" అనే నమ్మలేని వార్త వాళ్ళ చెవుల్లో పడితే మతులు చెడవూ మరి?

ఇలా మతులుపోయిన గుమాస్తాలంతా మరో ఐదు నిముషాల్లో తేరుకుని, వాళ్ళ వాళ్ళ సీట్లొదిలిపెట్టి, దాసు చుట్టూ చేరారు "ఏ కారణం

## పెండ్యాల నాగాంజనేయులు

వల్ల సెలవు పెట్టావు" అని నిగ్గదీస్తూ.

వాళ్ళ బాధ తెలిసిన దాను వాళ్ళందరికీ ఏవో రకరకాల సాకులు చెప్పి, ఏడ్పించి; కన్నీళ్ళు కార్పించి, చివరకు "నేను గురువారం రాత్రి బయల్దేరి బెజవాడ వెళ్తున్నానోచ్! శనివారం పొద్దున్నే వచ్చేస్తానోచ్" అన్నాడు.


అందులో ఓ ముసలి గుమాస్తా "నీకు బెజవాడ వెళ్ళే ఖర్మేం పట్టిందీ?" అంటూ డ్రాయరెక్కి కూర్చున్నాడు. మిగతా వాళ్ళు కోరస్ పాడారు. ఇంతలో తాసిల్దారుగారు ఆఫీసులో కాలెట్టడం చూసి ఎవరి సీట్లలోకి వాళ్ళు పారిపోయి "కలా లాడించడం మొదలెట్టారు.

● ● ●

అనగనగా ఓ బీద శంకరయ్యగారి భార్య కడుపు పదకొండోసారి పండింది. అదివరలో పండిన ఏ ఒక్క పంటా మూడురోజుల కన్నా ఎక్కువకాలం నిలిచింది లేదు. కాని ఈ పంటమాత్రం అలా కాదు. అందుకే నాలుగో రోజున శంకరయ్య బ్రహ్మానంద భరితుడై ఓ పెద్ద బోర్డుకట్టుకున్న జ్యోతిష్కుడి దగ్గరకు అద్దె సైకిలేసుకెళ్ళి "అయ్యా! ఇదిగో ఇదీ టైము. ఈ టైములో నాకో మొగపండు కలిగింది. దాని తాలూకు జాతకం యావత్తూ ఏకరువుపెట్టండీ" అన్నాడు సంతోషంగా గుంజనానుకుని గొంతుకూర్చుంటూ.

జ్యోతిష్కుడు పద్మాసనం వేసుకూర్చుని, పది పంచాంగాలు తిరగేసి, కాగితం, కలం పుచ్చుకుని, అప్పటికప్పుడు ఇళ్లూ వాకిళ్ళూ కట్టేసి, వాటిలో గ్రహాల్ని ప్రవేశపెట్టి "మరి శంకరయ్యగారి పంట తాలూకు జీవిత విశేషాలు ఏకరువు పెట్టండీ" అని కోరాడు.


గ్రహాలన్నీ కూడ బలుక్కుని ఏం చెప్పాయోగాని జ్యోతిష్కుడు మాత్రం "క్షమించండి శంకరయ్యగారూ! మీ పంట బహు నష్టజాతకప్పంట. అసలు బతికి బట్ట కట్టడం కష్టమంటున్నాయి గ్రహాలు" అంటూ మొదలు పెట్టాడు. శంకరయ్యకు ముచ్చెమటలు పోయలేదు. దిగులూ పడలేదు. లోగడ పది పంటలూ దక్కక పోవడంవల్ల మనసు రాయి చేసుకున్నాడు. కాకపోతే ఈ పంట నాల్గురోజులు నిలిచింది. ఇంకా నిలుస్తుందనే ధైర్యం వుండడంవల్ల "అయ్యా! జోతిష్కుడుగారూ! బట్ట కట్టకపోతే మానె. బ్రతికే యోగం వుంటే చెప్పండి" అన్నాడు బ్రతిమాల్తూ.




జ్యోతిష్కుడు శంకరయ్య మాటకు కడుపుబ్బ నవ్వుతూ కింద బడి దొర్లి, పొలమారి, మంచినీళ్ళు తాగి, మొహం కడుక్కుని, డ్రిల్లు చేసి "హెూర్నీ అసాధ్యం కూల! భలే నవ్విస్తార్ సార్ మీరు! హ్హబ్బ! హబ్బ! బ్రతికే యోగం ఉంటే బట్ట కట్టకపోతే ఎలా? అయినా ఇంకోసారి గ్రహాల్తో ప్రయివేట్ గా మాట్లాడుతానుండండి." అంటూ మళ్ళీ గ్రహాల్తో మాట్లాడి, కూడికలూ తీసివేతలూ చేసుకుని, శంకరయ్య తొడమీద సంతోష సూచకంగా అయిదువేళ్లూ తట్టుతేలేట్టు చరిచి "ఫలాని విధంగా శాంతి చేస్తే కుర్రాడు బతుకుతాట్ట. తీరా బతకడం అంటూ జరిగాక బట్టకూడా కట్టుకుంటాడు. అయితే ఆ కట్టే బట్టలు మాత్రం కేవలం నేతవి, నూలువీను... అందులోనూ మరీ ముతకరకమూ, నాసిరకమే కాని సిల్కులూ, వులెన్ లూ, ట్వీడ్లూ మాత్రం కావు" అన్నాడు చూపుడు వేలు శంకరయ్యముఖంమీద తైతక్కలాడిస్తూ.

శంకరయ్య ఓ ఉగ్గుగిన్నెడు ఆనందబాష్పాలు రాల్చి "నిజమా? నిజమేనా?" అన్నా డాశ్చర్యంగా.

ఆయన తనను కించపరుస్తున్నా






దని జ్యోతిష్కుడికి అనుమానం వేసి పక్కనేవున్న మంచినీళ్ళ కుండ పగలేసి "నిజమే!" అన్నాడు గంభీరంగా.

శంకరయ్య సంతృప్తిచెంది జ్యోతిష్కుడి కో "హస్తం" యిచ్చుకుని నమస్కారంచేసి, మళ్ళీ సైకిలెక్కి స్పీడుగా పోయేందుగ్గాను రిక్షా వాడు తొక్కి నట్టు తొక్కుతూ ఇంటికి చేరాడు.

కుర్రాడు పుట్టిన పదకొండవ నాడు జ్యోతిష్కుడు చెప్పిన విధంగా శాంతీ, పుణ్యాహవచనమూ, "లక్ష్మీదాసు" అనే నామకరణమూ చక్కగా యథావిధిగా జరిగాయి. తదాదిగా లక్ష్మీదాసు ఉయ్యాల్లోనూ చేతులమీదా పెరుగుతూ, వంటాముదమూ, డబ్బాపాలూ సేవిస్తూ మూడో నెలలో బోర్లపడి, అయిదో నెలలో పాకి, ఆరో నెలలో కూర్చుని పదోనెల వచ్చేసరి కల్లా లేచి నిలబడుతూ అన్నప్రాశనకి తయారయ్యాడు. ఆ రోజున డబ్బులూ, పుస్తకం, కలం, బంగారం అతడికి దూరంగా పేర్చి పెడితే పాక్కుంటూవెళ్ళి డబ్బులు చేత బుచ్చుకుని అందులో ఓ పావలాకాసు గభాల్న నోట్లో వేసుకుని గుటు కేయబోయాడు. గుటక దిగలేదు. ఉక్కిరి బిక్కిరయి గుడ్లు తేలేశాడు. తల్లీ తండ్రీ నానా కంగారూపడి గోలపెట్టి బెజవాడ కనకదుర్గమ్మకు మొక్కుకున్నారు. "తల్లీ! మా బిడ్డను కాపాడు. వాడిచేత నీకు కుంకం పూజ చేయిస్తాము" అని. అంతే! గుటక దిగింది. నాణెం పొట్టను పెట్టుకున్న కుర్రాడు దక్కాడు.

ఆ తర్వాత పన్నెండేళ్ళ వరకూ ఏ ఉపద్రవమూ సంభవించలేదు. నిక్షేపంగా థర్డుఫారంకూడా ప్యాసయ్యాడు. అయేడే దాసు తండ్రి భార్యా బిడ్డల్ని దిక్కులేనివాళ్ళను చేసి పోయాడు. శంకరయ్య నిలవ జేసిన "లవ్వ" ఏమీ లేనందువల్ల అతని భార్య వంటలక్కగా జీవితం సాగించాల్సి వచ్చింది. తల్లి కష్టం చూసిన దాసుక్కూడా ధనార్జన చెయ్యాలని కోరికపుట్టింది. పొద్దున్నే 9 గంటలదాకా వార్తాపత్రికలమ్మి, రాత్రిళ్ళు సినిమాహాళ్ళలో టీలూ, సోడాలూ అమ్మి ఏదో విధంగా రోజూ కష్టపడి ఓ రూపాయి కళ్ళ చూసి తల్లికి సాయపడూ స్కూల్ ఫైనల్ దాకా చదువుకుని, ఆ దరిమిలా సర్వీస్ కమీషన్ పరీక్షల కెళ్ళి ఈ తాలూకాఫీసు ఉద్యోగం దక్కించుకుని, మరో రెండేళ్ళకు వివాహం చేసుకుని సుఖంగా ఉంటున్నాడు. ఎంత సుఖంగా ఉంటు

న్నాడూ అనుకున్నా అప్పుడప్పుడూ ఓ తలనెప్పో, ఓ జ్వరమో, ఓ చెవిలో పోటో రాకమానదుగా మనిషన్న తర్వాత. అదిగో అలాంటప్పుడే దాను తల్లికి మొక్కుబడి సంగతి జ్ఞాపకం వచ్చి దానుమీద తాడెత్తున లేస్తుంది. దానికి దాను నవ్వుతూ "ఆఫీసులో పని చచ్చే వత్తిడిగా వుందాయె. తీరా బెజవాడ వెళ్ళి రావాలీ అంటే ఓ రోజన్నా కనీసం సెలవు పెట్టాలి గదా? సెలవు పెడ్తే పాపం గవర్నమెంటు కెంత కష్టం! మన కెంత నష్టం? నీ కెందుకు? నేను తీరుబడి చూసుకుని మొక్కు చెల్లించు కొస్తాగా" అని తల్లిని చల్లబరుస్తాడేగాని ఏ పరిస్థితిలోనూ—రోగ మొచ్చినా రొష్టొచ్చినా, వానొచ్చినా, వరదొచ్చినా కూడా ఆఫీసు కెళ్ళడం మానడు. ప్రతిరోజూ అంతో ఇంతో అదనంగా కళ్ళచూస్తేగాని నిద్రపోడు. అతని విషయం చూసి చూసి, కోడల్ని కూడగటుకుని, ఆ యేడే వచ్చిన కృష్ణా పుష్కరాన్ని అనరగా తీసుకుని, మొక్కుకూ, పుష్కరానికీ పవిత్రమైన లంకె ఒకటి సృష్టించి కొడుకుమీద ఒత్తిడి తెచ్చింది తల్లి. ఇదీ తప్పుకోబోయాడు నేర్పుగా. ఇంతలో భార్య తెలివిగా మొక్కుబడికి, తన ప్రాణానికి లంకె వేసింది. దాంతో దాను దారి కొచ్చి 'సర్లే' అన్నాడు అయిష్టంగానే.

తత్ఫలితమే 'శుక్రవారంనాడు సెలవు!'

• • •

దాను తిరిగి రావలసిన శనివారం వచ్చినా, అతడుమాత్రం రాలేదు. ఇంటిదగ్గర అత్తా కోడళ్ళు అతడికేదైనా గండం సంభవించిందేమోనని భయపడుతూ, వీధిగుమ్మంలోనే - అతడి రాకకోసం ఎదురు చూస్తూ - కనకదుర్గకు మొక్కుతూ కూలబడ్డారు.

ఆఫీసులో గుమాస్తాలు ఎక్కడి పను లక్కడ బ్రేక్ వేసి గుమిగూడి దాను తిరిగి రాకపోవడానికి ఆశ్చర్యం ప్రకటిస్తూ, కారణాలు వూహిస్తూ, వెళ్ళగక్కుతూ, ఒకరితో మరొక రేకీభవిస్తూ, ఒకరినొకరు ఖండించుకుంటూ బుర్రలు గోడకేసి బాదుకుంటూ, లీటర్ల లెక్కన కాఫీ పుచ్చుకుంటూ, సిగరెటు కాలుస్తూ, పొడుం పీలుస్తూ, కూర్చుంటూ, లేస్తూ, "ఇశ్శో" "అశ్శో" అంటూ ఆఫీసు వరండాలో పచార్లు చేస్తున్నా రంతా.

మధ్యాహ్నం పన్నెండు గంటలకు— ఆఫీసుకో టెలిగ్రామూ, ఇంటికో ఉత్తరమూ వచ్చాయి.

టెలిగ్రాం : అనారోగ్యంగా ఉంది. మరి నాల్గురోజులు సెలవిప్పించ ప్రార్థన— దాను.

గుమాస్తాల మనసు క్షణాలమీద తేలిక పడింది 'మిస్టరీ' విడిపోయినందుకు. అంతా "అయ్యో పాపం!" అని పైకంటూ లోపల మాత్రం "కావలసిందే వెధవకు" అనుకున్నారు. కొందరు "పాపం! రోజుకు 5 రూపాయలు చొప్పున చూసుకున్నా పాతిక రూపాయలు క్షవరం గదా దానుకు?!" అంటూ కసిగా జాలిపడ్డారు.

మరో అరగంటలో తాసీల్దారుగారు వేంచేసి, దాను పెట్టిన సెలవును సానుభూతితో మంజూరు చేశారు.

ఇక ఉత్తరం: "గం॥ భ॥ స॥ తల్లిగార్కి, దాను నమస్కారాలు. ఇక్కడ నేను క్షేమంగానే వున్నాను. దుర్గగుడిలో విపరీతమైన ఒత్తిడి వల్ల నా మొక్కు ఈ రోజు తీరలేదు. వచ్చే శుక్రవారం తీర్చుకుని, ఆ తర్వాత వచ్చే శని ఆదివారాలు ఆఫీసుకు సెలవే కాబట్టి సోమవారం నాటికి (అంటే ఆ రోజే నా పుట్టిన రోజు కూడా) వస్తాను. ఎప్పటిలాగే మా ఆఫీసు గుమాస్తా లందరిని ఆ రోజు సాయంత్రం టీ పార్టీకి పిలుస్తాను. కాబట్టి తగిన ఏర్పాట్లు చేయవలసింది. నేను సోమవారం నాడు సరాసరి ఆఫీసుకే వెళ్తాను. సాయంత్రమే గుమాస్తాలతో కలిసి ఇంటికి వస్తాను. మరేం కంగారు పడవద్దు.

నీ కుమార్డు,
దాను."

అత్తాకోడళ్ళకు ఆందోళన తగ్గింది. మొక్కు తీర్చుకోలేకపోయినందుకు తల్లి కొంచెం జాలిపడి "పిచ్చిసన్నాసి!" అనుకుంది.

---

* మొదటివాడు: "ఏమండీ! మీ సూటు ఎంత బాగా కుట్టాడండీ టైలరు! వాడి ఎడ్రసిస్తారా?"

రెండోవాడు: "ఇస్తానుగానీ, ఒక్క షరతు."

మొ. వా: "ఏమిటూ షరతు?"

రెం. వా: "మీరు మాత్రం నా అడ్రసు వాడి కివ్వనని మాటివ్వాలి."

"మా ఆయన కెంత భక్తో?" అని ఉబ్బిపోయింది దాసు భార్య.

ఆ తర్వాత గురువారంనాడు మరో టెలిగ్రాం వొచ్చిందాఫీసుకు మరో రెండు రోజుల సెలవు పొడిగిస్తూ—

సెలవు మంజూరైంది.

గుమస్తాలంతా సంతోషంగా మరిరెండు కాఫీలదనంగా కొట్టేశారు ఆరోజున.

మళ్ళీ గురువారంనాడు మరో తంతి వచ్చింది-మరో రెండురోజుల సెలవు పొడిగిస్తూ.

గుమస్తాలు మరికాస్త కసిగా జాలిపడ్డారు.

తాసీల్దారు మరికాస్తజాలిగా సెలవు మంజూరు చేశాడు.

తర్వాత సోమవారంనాడు ఖచ్చితంగా ఆఫీసు టైముకు తన సీట్లో జొరబడ్డాడు దాసు.

అతని రాక కెదురు చూస్తున్న గుమాస్తాలు అతన్ని చుట్టుముట్టారు యోగక్షేమాలు విచారిస్తూ- జాలి పడుతున్నట్టు నటిస్తూ — ఓ కుర్ర గుమాస్తా "పాపం యాభై రూపాయలు నష్టపడ్డావుగదయ్యా" అని పబ్లిగ్గా జాలిపడ్డాడు.

ముసలి గుమాస్తా కుర్ర గుమాస్తాను ఎర్రటి కళ్ళతో చూసి దాసుతో "ఇంతకీ నీ జబ్బేమిటి ? మందెవరిచ్చారు? అసలేమిటి కథ?" అంటూ డ్రాయరెక్కాడు.

ఇంతలో ఆఫీసు ప్యూను "అయ్యా! తాసిల్దారుగారొస్తున్నారండీ" అని హెచ్చరించేసరికి "ఛీ! మాంఛి ముక్కపట్టులో వస్తాడీయన" అనుకుంటూ ఎవరి సీట్లలోకి వారు పరుగెత్తారు.

ఆ తర్వాత పార్టీలు రానూ వచ్చారు. దాసు నష్టబోయాడనుకున్న సొమ్ము ముట్టజెప్పనూ చెప్పారు.

గుమాస్తాలు శ్రుతి పెంచి ఏడ్చేశారు.

మరో అరగంటకు ఆఫీసు టైమైపోతుందనగా దాసు ఒక్కో గుమాస్తాను పేరు పేరునా టీపార్టీకాహ్వానించాడు.

అంతా వెళ్ళారు; సుష్టుగా తిన్నారు; గడగడ తాగారు; గర్రున త్రేన్చారు.

"ఇంతకీ నీ జబ్బేమిటి? కథేమిటి? కమామీషేమిటి? ఎంతకూ చెప్పవేమయ్యా దాసూ" అంటూ జీడీలా పట్టుకుని నసపెట్టేశాడు ముసలి గుమాస్తా.

తటాల్ని వాళ్ళందరి మధ్యకు ఓ మంచం లాక్కుని, దానిపై నిలబడి "ఆఁ యేముందీ? డబ్బు లేక పోవడమే అనారోగ్యం" అన్నాడుదాసు.





గుమస్తా లందరికీ బలే హుషారు పుట్టింది. "అసలు కథేమిటో చెప్పు" అన్నారంతా. దాసు గొంతు సవరించు కున్నాడు.

"మహాశయులారా! నేను కనక దుర్గకు మొక్కు తీర్చుకునే నిమిత్తం బెజవాడ వెళ్ళాను. శుక్రవారం నాడు సూర్యోదయాత్పూర్వమే కృష్ణకెళ్ళాను స్నానార్థం. గుడ్డలు, సంచీ ఒడ్డునే పెట్టి కృష్ణలోదిగాను. పుష్కరాల సమయం కావడంవల్ల జనం విపరీతంగా వున్నారు. ఆ జనాన్నిచూస్తూ అలాగే అరగంటసేపు ఆనందంగా స్నానం చేసి ఒడ్డెక్కి చూస్తే నాతాలూకు బట్టలు సంచీయావత్తూ మాయమైపోయాయి. కంగారుగా వెదుక్కోడం మొదలెట్టాను. ఆ యిసుకలో ఓ పావలా మాత్రం దొరికింది. నా కంగారు చూసి జనం చుట్టూజేరి సానుభూతి వాక్యాలు, "జాగ్రత్తండీ" అని హెచ్చరికలు చేశారేగాని, ఒక్కడన్నా పోనీ "అయ్యోపాపం! కష్టాల్లో ఉన్నట్టున్నారు. ఇదిగో ఓ రూపాయ తీసుకోండి; పోనీ ఓ అర్థ పుచ్చుకోండి; కనీసం ఈ పావలా స్వీకరించండి" అని ఒక్క సన్నాసీ అన్నపాపాన పోలేదు. ఆఁ ... ఎవడికేం బట్టిందిలే! సరే! చేసేదేముంది? ఎరిగున్న శాల్తీ లేవైనా తగుల్తాయేమో, ఓ అయిదు రూపాయలన్నా బదులు పుడ్తుందేమో అని జాగ్రత్తగా ముఖాలన్నీ పరీక్షిస్తూ

పిచ్చగా తిరగడం మొదలుబెట్టా. ఊహు! కానీ... అల్లంత దూరంలో నా చిన్నప్పు డెప్పుడో నే నెరిగున్న సూర్యనారాయణమూర్తి గారిలా కనబడ్డాడో బ్రాహ్మడు. స్నానం చేసేవాళ్ళకు మంత్రాలు చెప్పి వారి నెత్తిన ఓ చెంబెడు నీళ్ళు కుమ్మరించి వాళ్ళకు తోచింది పావలో, అర్ధో ఇస్తే పుచ్చుకుంటున్నాడు. నాకు కాస్త ధైర్యం కల్గింది. ఆయన దగ్గరకెళ్ళి నేను ఫలానా అని జ్ఞాపకంచేసి అవసరం గడుపుకుందామనీ, మొక్కు తీర్చుకు తిరిగొద్దామనీ! నెమ్మదిగా ఆయన్ని సమీపించా. తీరా దగ్గరగా చూస్తే, ఆయ నవునో కాదోననే సందేహం కలిగి బాగా గుర్తు చేసుకోడానికి ప్రయత్నించడం మొదలు పెట్టాను. ఇలా ఆలోచిస్తుండగానే ఆయన మరో పార్టీ దగ్గర కెళ్ళాడు. నేనూ ఆయన్ననుసరించడం మొదలు పెట్టానే గాని నాకు అనుమానం పీకుతూనే వుంది. ఇలా ఆయన ఓ ఇరవై పార్టీల దగ్గరకు మారుతూ, కంచుఘంటలాగా మంత్రాలు చెప్తూ డబ్బులు పోగేసుకుంటూనే వున్నాడు. ఇంతసేపూ ఆయనవెంటబడి తిరగడంవల్ల హఠాత్తుగా నాకేదో కొత్త విషయం తెలిసినట్లయింది. ఏమిటదీ? మంత్రాలు... మరో పార్టీ దగ్గర ఆయన మంత్రాలు వల్లిస్తూవుంటే నేనూ నోటిలో అనుకున్నాను. డెడ్ కరక్ట్‌గా వచ్చేశాయి నాకు తెలియకుండానే ... అంతే! నాలో జ్ఞానోదయం అయింది. నా జబ్బుకు మందు తెలిసింది. వెంటనే దగ్గరున్న పావలాతో మంగలి దగ్గరకు నడిచాను."

అంటూ దాసు తన నెత్తిమీది ఉన్నిటోపీ తొలగించాడు— గుండూ! పిలక!






గుమాస్తాల బాధ ఇంతా అంతా కాదు— నవ్వేవాళ్ళు నవ్వారు. ఏడ్చేవాళ్ళేడ్చారు. దాసు మళ్ళీ ఆరంభించాడు. "ఆరోజు మధ్యాన్నం ఒంటిగంటకు నే సంపాదించింది ఇరవైనాలుగు రూపాయలన్నర. వెంటనే ఇంటికో ఉత్తరం రాశాను. మర్నాడు ఆఫీసుకో టెలిగ్రాం ఇచ్చాను."

"అయితే ఈ పదిరోజులూ అదే ఉద్యోగమన్న మాట?" ముసలి గుమస్తా ప్రశ్న.

"ఆహా, నిక్షేపంగా! నా ఖర్చులు పోను— అంటే సినిమాలు, సర్కసులూ, కాఫీలు, సిగరెట్లు, ఎగ్జిబిషన్లు, ఈ కట్టుకున్న బట్టలు, చెప్పులు, టోపీ, ఈ రోజున నా దగ్గర మిగిలిన పుష్కరాల సంపాదన తాలూకు రొక్కం రెండువందల ఎనభై రెండు రూపాయల చిల్లర" అంటూ జేబులోనుంచి రకరకాల నోట్లున్న కట్టా, కొంత చిల్లరా బయటికి తీశాడు. అందులో నుంచి ఓ అరిగిపోయిన విభూతి పండు కింద పడింది.

"మరి నీ భోజనం సంగతేమిటి?" ముసలి గుమాస్తా ప్రశ్న.

"శివాలయం వీధి సత్రంలో రోజూ సంతర్పణ జరిగేది బ్రహ్మాండంగా: అక్కడే మనతిండీ, నిద్రాను" అన్నాడు దాసు దర్జాగా చిరునవ్వుతో.

ఇంతసేపూ వంటింట్లో కూర్చుని శ్రద్ధగా వింటున్న అత్తా కోడళ్ళు "ఇదేమిటి?" అంటే "ఇదేమిటి?" అన్నట్లు సైగలు చేసుకున్నారు. అత్త ఉండబట్టలేక "ఇన్ని చెప్పాడుగాని మొక్కుబడి సంగతి చెప్పాడు కాదేమే" అంది కోడలితో.

కోడలు నాలిక వెళ్ళబెట్టింది.

"మరి మొక్కెప్పుడు తీర్చుకున్నావ్?" ముసలి గుమాస్తా వదల్లేదు.

"మొక్కా? అదీ... ఈ ట్రిప్పులో కుదర్లేదులే! మళ్ళీ దసరా నవరాత్రులకి బెజవాడెలాగూ వెళ్ళాలి. అప్పుడు తీర్చుకొచ్చేస్తాను. అమ్మవారెక్కడికి పోతుంది? నే నెక్కడికి పోతాను?" అంటూ మంచం దిగాడు దాసు.

"హరి దిక్కుమాలిన వాడా!" అంటూ సొమ్మసిల్లిపోయింది దాసు తల్లి! కోడలు సరే సరి!

గుమాస్తాలంతా నేలమీదబడి దొర్లుతున్నారు ఏడ్పులాంటి నవ్వులతో...

□□□